# మగ మనసు

"**నాదృష్టిలో** ఆడైనా, మగైనా ఒక్కటె.

ఇద్దరూ సరి సమానమే.

ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ కాదు.

నేను భర్తని కనక నేను నీ మీద ఏదో అధికారం చెలాయిస్తానని నువ్వు భయపడ నవసరం లేదు.

మనిద్దరం ఒకరి అభిప్రాయాలు ఒకరు మన్నించటం, గౌరవించటం నేర్చుకోవాలి.

పెళ్ళికాక ముందు మనం కొన్ని పొరపాట్లు చేసి ఉండవచ్చు. అంతమాత్రంచేత వాటిని మనసులోనే దాచుకుని జీవితాంతం మథన పడవలసిన అవసరం లేదు.

చేసిన తప్పు బయట్కు చెప్పేస్తే మనసు తేలిక పడుతుంది.

అందుకే ముందుగా నా విషయం చెప్తాను.

కాలేజీలో చదువుకునే రోజుల్లో నాకు ఒక అమ్మాయితో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ముదిరి ప్రణయంగా మారింది. పెళ్ళికూడా చేసుకుందామని నిశ్చయించుకున్నాము.

ఎన్నో కలలు కన్నాం...ఎన్నెన్నో ఊహించుకునం.

పార్కులు... సినిమాలు...షికారులు...కలిసి తిరిగాం. కలిసి తిన్నాం. కానీ, 'మాన్ ప్రపోజెస్, గాడ్ డిస్పోజెస్' అన్నట్లుగా మాపెళ్ళికి ఆ అమ్మాయి తలిదండ్రులు ఒప్పుకోలేదు. ఆ అమ్మాయికి మరో సంబంధం చూసి పెళ్ళికూడా చేసేరు.

ఆ తరవాత విషయం నీకు తెలిసిందే...మన పెళ్ళి. పెళ్ళికి ముందు మరో అమ్మాయితో సంబంధం ఉంది. కనక నేను పెళ్ళి చేసుకోకుండా ఉండిపోవాలంటే ఎలా?

అందుకే జరిగిపోయినదాని గూర్చి మర్చిపోవాలి. కొత్త జీవితాన్ని సృష్టించుకోవాలి.

మనిషికి మతిమరుపు అనేది దేవుడిచ్చిన వరం.

ఇప్పుడు చెప్పు. నువ్వుకూడా పెళ్ళికి ముందు ఎవర్నైనా...అఫ్‌కోర్స్...ఉంటేనేలే. నిర్భయంగా చెప్పు. చెప్తే నీ మనస్సు తేలిక పడుతుంది. నేను ముందే చెప్పాను నీకు-నా దృష్టిలో స్త్రీయైనా, పురుషుడైనా సమానమే అని.

నా లాంటి సంఘటనే నీ జీవితంలోకూడా జరిగి ఉండచ్చు. అలా జరిగితే నిన్ను నే నేం తప్పుగా అర్థం చేసుకోను. ఊఁ...చెప్పు. మౌనంగా ఉన్నావేం...ఆలోచిస్తున్నావా? భయం వేస్తోందా? నేను నీ భర్తని. నీతోపాటే నీ తప్పుల్నికూడా భరించే శక్తి నాకుంది. చెప్పొచ్చా, లేదా అని ఆలోచిస్తున్నావా, మై స్వీట్ హార్ట్!

-పినిశెట్టి శ్రీనివాసరావు

పోనీ నువ్వేం చెప్పొద్దులే. నేనే చెప్తాను-విను.

నిన్ను చూస్తుంటే నీకు అలాంటి చరిత్ర ఉండదని నేను బల్ల గుద్ది చెప్పగలను.

నిర్మలమైన నీ కళ్ళు...అమాయకత ఉట్టిపడే నీ మొహం చూస్తే చెప్పొచ్చు నువ్వు జాతి పుష్పానివని. 'ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ ది మైండ్' అన్నట్లు, నీ మనసులో కల్మషం ఉంటే అది నీ ముఖంలో ప్రస్ఫుటం కాక మానదు. నిర్మలమైన నీ ముఖం చూస్తుంటే చెప్పొచ్చు నీ మనసులో ఎటువంటి మాలిన్యం లేదని, నువ్వు తుమ్మెద వాలని పుష్పానివని.

మీ కుటుంబం ఎంత సాంప్రదాయికమైనదో నాకు తెలును. అందులో నుంచి వచ్చిన నిన్ను ఇలా అడుగుతున్నానంటే నిన్ను ఊరికే ఆట పట్టించటానికే.

నువ్వు నిజంగా 'నీకు అలాంటి అనుభవం ఉందన్నా' నేను నమ్మను.

మరో నిజం చెప్పనా?

నేను ఇంతకు ముందు చెప్పిందికూడా కట్టుకథే.

నా జీవితంలోకూడా పెళ్ళికి ముందు మరే ఆడపిల్లతో పరిచయం లేదు.

నీ రియాక్షన్ చూద్దామని అలా అబద్ధం చెప్పానంతే.

ఒట్టు. నా మాట నమ్ము.

నీ మెడలో సూత్రం సాక్షి.

నీ జడలో మల్లెలు సాక్షి.

నీ బుగ్గల సిగ్గుల సాక్షి.

ఇంకో విషయం చెప్పనా?

నేనే కాదు, ఏ మగాడూ తన భార్యకు మరో మగాడితో సంబంధం ఉందంటే సహించలేడు. నేనూ అంతే.

అందుకే నిజం సంగతి అలా ఉంచి, నువ్వు కూడా నాలా ఓ అబద్ధపు కథ చెప్పి ఉంటే...నేను ఈ పాటికి...నిన్ను..."

** ** **

'థాంక్ గాడ్! తొందరపడి నిజం చెప్పేశాను నేను' అని మనసులో అనుకొని, అదురుతున్న గుండె మీద రెండు చేతులతో గట్టిగా అదుముకుంది కొత్త పెళ్ళికూతురు.

